కథ

**ఆదిమధ్యం రామానుజస్వామి**

# పనసపండు-పచ్చావకాయ

పెళ్లయి పాతికేళ్లు గడచినా సంవత్సరానికొకసారి మామగారి ఊరికి వెళ్లి, ఒక వారం రోజులు అల్లుడి మర్యాదలు పొంది అత్తమామలిచ్చే కొన్ని సరుకులు హైదరాబాద్‌కి మోసుకురావడం భలే సరదా, సంబడం పరమేశానికి. రోజంతా బిజీబిజీగా సాగే 'జంట' నగరాలు 'తంటా' జీవితంతో విసిగివేశారిన పరమేశం పిల్లలకి సెలవులు ఎప్పుడొస్తాయా, తాతగారి ఊరికి వెళ్లి ఒక వారం రోజులు సరదాగా గడపొచ్చని చిన్న ఆశ.

ఇక పరమేశం భార్య కాసులు విషయం చెప్పనక్కర లేదు. పెళ్లయి ఇన్నేళ్లు గడచినా పుట్టింటి మీద మోజు, మమకారం ఎక్కువే. అలాగే అమ్మ ఎంతో శ్రమోడ్చి ప్రతి సంవత్సరం పెట్టి తన వాటాగా ఇచ్చే పచ్చావకాయ, బెల్లపుఆవకాయలను హైదరాబాద్ మోసుకురావడం అలవాటు. హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో పుట్టింటి నుండి బయలుదేరేటప్పుడు తల్లిదండ్రుల, అన్నదమ్ముల ఎడబాటును ఓర్చుకోలేక ఇప్పటికీ చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడుస్తూంటుంది. బస్సు ఎక్కాక కొన్ని కిలోమీటర్ల ప్రయాణం వరకూ వాళ్ల ఊసులే తలుస్తూంటుంది కాసులు.

ఈ సంవత్సరం ఆఫీసులో పని వత్తిడి ఎక్కువగా ఉన్న కారణంగా ముందుగా సెలవు పెట్టి రానూపోనూ రైలు రిజర్వేషన్‌లు చేయలేక జనరల్ బోగీలో ప్రయాణానికి నడుం కట్టాడు పరమేశం. మామగారి ఊరు చేరాలంటే రైలు దిగాక మరో యాభై కిలోమీటర్లు బస్సు ప్రయాణం తప్పనిసరి. మొత్తంమీద జనరల్ బోగీలో ప్రయాణం, బస్సు ప్రయాణం ముగించుకుని, నానా అవస్థలు పడి సకుటుంబ సమేతంగా మామగారి ఊరు చేరాడు పరమేశం.

"ఒసేవ్! కాసులూ! ఈ సామాన్లన్నీ జాగ్రత్తగా వచ్చాయో లేదో లెక్క చూడు. వెధవ జనరల్ బోగీ ప్రయాణం కాదు గానీ వళ్లు హూనం అయింది!"

"ఒక వారం రోజులు అనవసరమైన టెన్షన్‌లు పెట్టుకోక ప్రశాంతంగా ఉండండి! సామాను విషయం నేను చూసుకుంటాలెండి! మా అమ్మ వేన్నీళ్లు పెట్టింది. పెరట్లో స్నానం చేసి భోజనానికి సిద్ధంకండి!"

ఈ సెలవుల్లో పిల్లల సరదా విషయం పక్కన పెడితే, ఈ ప్రయాణంలో పరమేశం ముఖ్యోద్దేశమేమిటంటే.... సంవత్సరానికి సరిపడా చింతపండు, కుంకుడుకాయలు, కొండచీపుర్లు వగైరా సరుకులు, హైదరాబాద్‌లో ప్రియం కనుక అత్తగారింటి నుంచీ మోసుకెళ్లొచ్చని. ఇక కాసులి వాటా బెల్లం ఆవకాయ, పచ్చావకాయ సరే సరి. ఈ విషయంలో పరమేశం, కాసులూల ఉద్దేశ్యాలు కలుస్తాయి. వాళ్లమ్మతో ఏవో మాటల సందర్భంలో ఈ సరుకుల జాబితా ఒకటొకటి ఏకరువు పెడుతుంది కాసులు. వీటిలో కొన్ని సరుకులు ఆ ఊరిలో చవకగా దొరుకుతాయి కనుక ఈ 'ట్రిప్పు'లో ప్రయాణం ఖర్చులైనా కలిసి రావాలనే ఉద్దేశ్యం కాసుల్ది.

* * *

వారం రోజులూ అత్తమామల దగ్గర అల్లుడి సత్కారాలు పొందుతూ 'డొమెస్టిక్ కలెక్షన్లన్నీ 'వన్ బై వన్' కొట్టుగదిలోకి చేరదీశాడు పరమేశం. మొత్తం మూటలు, సంచీలూ, బాగ్‌లు, పెట్టెలు కలిసి పదమూడు సామాన్లయ్యాయి. ఈ మొత్తం లగేజీతో పరమేశం హైదరాబాద్‌కి తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. ఉన్న సామాన్లన్నీ కుటుంబంలో అందరికీ తలొకటి ఇవ్వగా పరమేశానికి రెండు భుజాలకీ రెండు బాగ్‌లు, రెండు చేతుల్లో రెండు సంచీలు వచ్చాయి. చేతిలో ఉన్న రెండు సంచీలలో ఒకదానిలో ఆవకాయల బకెట్లు మరో దానిలో బావమరిది సరదా పడి ఇచ్చిన పనసపండు ఉన్నాయి. ఈ సామానంతా మోసుకుంటూ 'ఎర్రచొక్కా' కూలీలా హైదరాబాద్‌కి తిరుగుప్రయాణమయ్యాడు పరమేశం.

పరమేశం ఇద్దరు కూతుళ్లూ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నారు. అమ్మమ్మ దగ్గర ఓ వారం రోజులు సరదాగా గడిపారు గానీ ఈ సామాన్ల మోత వాళ్లకి ససేమిరా ఇష్టం లేదు. ఏదో స్టైల్‌గా ఓ ట్రావెలింగ్ బాగ్‌తో తక్కువ సామానుతో ప్రయాణం సుఖంగా సాగాలని వారి ఉద్దేశ్యం. కానీ పరమేశం 'లగేజీ లెవెల్' చూసి చిన్న కూతురు ప్రయాణం ఆరంభమైన దగ్గర నుండి తండ్రిని విసుక్కుంటూనే ఉంది.

"ఏంటి నాన్నా! లగేజీ లిమిటెడ్‌గా ఉండాలి గానీ ఈ మూటలూ, సంచీలు ఏమిటి? ఆ పనసపండుని ఇక్కడ నుంచి మోయాలా? అదేమైనా హైదరాబాద్‌లో దొరకని వస్తువా? ఏమిటి?"

"ఇంకా నయమేనే! ఆ కుంకుడుకాయలు, చింతపండు ట్రాన్స్‌పోర్ట్‌లో బుక్ చేశారు కాబట్టి సరిపోయింది లేకపోతే అవి కూడా మన చేత మోయించే వారేమో!" అని అందుకుంది పెద్దకూతురు.

అతికష్టం మీద ఈ సామానంతా మోసి బస్ ఎక్కించాడు పరమేశం. ఆ బస్సు ప్రయాణంలో కుదుపులకి అత్తగారు ఆప్యాయంగా నూనె దట్టించి ఇచ్చిన ఆవకాయలో నూనె తేటతేరి ప్లాస్టిక్ బకెట్ మూత ఊడి నూనె బస్సులో వొలికింది. ఒకాయన ఆ నూనె మీద కాలు వేసి, కాలు జారి ఒక అమ్మాయి వొళ్లో పడినందుకు పెద్ద గొడవ జరిగింది. ఇంతలో బస్సు కండక్టరు కలుగజేసుకుని "ఈ ఆవకాయ బకెట్ ఎవరిది?" అని ఒక్క కేక వేసేసరికి, పరమేశం కంగారు పడి "ఏంటయ్యం దయ్యా!" అంటూ వచ్చాడు.

"చూడండి మాస్టారూ! ఆ ఆవకాయ బకెట్ మూత సరిగా బిగించకపోవడం వల్ల ఎంత పని జరిగిందో...బస్సంతా నూనె ఎలా వొలికిందో.."

"ఉండవయ్యా! అనవసరంగా గొడవ చేయకు. ఏదో ఒకటి చేసి నీ బస్సులో నూనె లేకుండా చేస్తాలే" అంటూ సంచీలో ఉన్న న్యూస్‌పేపరు తీసి కింద ఒలికిన నూనంతా తుడిచి ఆ న్యూస్‌పేపరు కిటికీలోంచి అవతలికి పారేశాడు. ఇదంతా బస్సులోని వాళ్లంతా చూసి నవ్వుకుంటుంటే పరమేశం పిల్లలకి సిగ్గేసింది. పరమేశాన్ని విసుక్కున్నారు.

బస్సు దిగి రైల్వే స్టేషన్ చేరడానికి రిక్షా మాట్లాడాలి. ఇంత సామాన్ని చూసి రిక్షావాళ్లు కూడా ఎక్కువ డబ్బులు అడగడం మొదలెట్టారు. ఇరవై రూపాయలడిగే చోట అరవై అడగడం మొదలెట్టారు. ఎలాగో వాళ్లతో బేరం కుదిరి అంతా రైల్వే స్టేషన్ చేరారు.

"ఇంత సామాను ఇంక మోయలేం కూలీని మాట్లాడండి" అంది కాసులు. కూలీని మాట్లాడితే వంద రూపాయలిమ్మన్నాడు.

'వంద రూపాయలా! వంద రూపాయలకి హైదరాబాద్‌కి టికెట్ వస్తుంది. ఏంటయ్యా మరీనూ! కొంచెమైనా న్యాయంగా ఉండాలి కదా! సరేలే నేనే మోసుకుంటాను" అంటూ గొణుక్కుంటూ మళ్లీ కూలీ అవతారమెత్తి భుజాలకు సంచీలు తగిలించుకుని ప్లాట్‌ఫారం వైపు నడక ప్రారంభించాడు. ప్లాట్‌ఫారం మీద నడుస్తుండగా 'బిగ్‌షాపర్' సంచీ తెగి దానిలోని పనసపండు కాస్త ప్లాట్‌ఫారం మీద దొర్లింది. ప్లాట్‌ఫారం మీద గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ ప్రయాణానికి సిద్ధంగా ఉన్న 'హైటెక్ బాబు'లందరూ పరమేశాన్ని, పనసపండుని ఎగాదిగా చూశారు. ఇంతలో పరమేశం ఆ దొర్లిన పనసపండు పట్టాల మీదకి జారకుండా పట్టుకుని ఎవరిమీదా

కోపం ప్రకటించలేక ఈ కర్రల సంచీలని మన చేతుల్లో పెట్టి వాళ్ల అడ్వర్టైజ్‌మెంట్‌గా వాడుకుంటూ కాస్త గట్టిగా ఉండే కర్రలని అమర్చడం లేదని బట్టల షాపుల వాళ్లని తిట్టుకున్నాడు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కి ఇంత సామాను బెర్తుల కింద సర్ది ఊపిరి పీల్చుకున్నాడు పరమేశం.

* * *

ఉదయానికల్లా రైలు హైదరాబాద్ చేరింది. రాత్రి బోగీలో నేల మీద పడుకున్న ఒక వ్యక్తి తెల్లచొక్కా కాస్త, బెర్తుల కింద ఉన్న బకెట్‌లో నుండి ఆవకాయ తేటతేలి కారిన నూనెకి, ఎర్ర చొక్కాగా మారింది.

పరమేశం సకుటుంబ సమేతంగా సామానుతో సహా నాల్గవ నెంబరు ప్లాట్‌ఫారం మీద దిగాడు. కూలీ వాళ్ల కోసం కలయజూసి బేరం కుదరక సామాన్లన్నీ యధావిధిగా మోసుకుంటూ ఒకటవ నెంబరు ప్లాట్‌ఫారం చేరే సరికి తల ప్రాణం తోకకి పట్టింది. అక్కడ నుండి స్టేషన్ బయట పడి ఇంటికి ఆటో బేరమాడి సరాసరి ఇల్లు చేరాడు. అత్తగారు అపురూపంగా ఇచ్చిన ఆవకాయ బకెట్లు తదితర సామానంతా లెక్క చూసుకుని కాళ్లు చేతులు ముఖం కడుక్కుని పనస పండు సంచీలో నుండి బయటికి తీసి కత్తి గురించి కిచెన్‌లోకి పద్దాడు.

"ఇప్పుడే కదండీ ప్రయాణం చేసి వచ్చాము. ఆ పనసపండు సంగతలా ఉంచి ప్రయాణం బడలిక తీరడానికి స్నానం చేసి విశ్రాంతి తీసుకోండి" అంది కాసులు.

పెళ్లాం మాట వెంటనే వింటే మగాడు, మొగుడెందుకవుతాడు. కాసులెంత చెబుతున్నా వినకుండా ఒక గోనె సంచి తెచ్చి పనసపండు, కత్తి దగ్గర పెట్టుకుని హాల్లో కూర్చున్నాడు పరమేశం.

"పనసపండు కోయడమంటే మాటలా... ఎంతో ఓర్పూ, నేర్పూ కావాలి. మా చిన్నతనంలో అన్నయ్య చేతికి చారెడు నూనె పట్టించి పదునైన కత్తితో పనస పండు కోసి మా ఇంటిల్లిపాదికి పంచేవాడు. మేమంతా అరుగుమీద కూర్చుని పనసతొనలు ఎంతో ఇష్టంగా తినేవాళ్లం. తరువాత పనసపిక్కలన్నీ ఒక చోట చేర్చి వాటితో ఆటలాడేవాళ్లం. మా అమ్మ పనసపిక్కలు ఉడికించి, ఆవపెట్టి కూర చేసేది. ఆ రోజులే వేరు" అంటూ కొంచెం 'ఫ్లాష్ బాక్'లోకి వెళ్లింది కాసులు.

"చాల్లే బడాయి నేనూ నేర్పుగా కోయగలనంటూ" కత్తి తీసుకుని పనసపండు 'డిసెక్షన్' మొదలెట్టాడు పరమేశం. చేతికి రాసుకున్న నూనె జిడ్డు వలన చేయి జారి పరమేశం చేయి తెగింది. వెంటనే రక్తం బొళబొళా కారటం మొదలయింది. 'చెప్పిన మాట వినరు కదా' అంటూ విసుక్కుంటూ చేతికి ఒక చీరగుడ్డ ముక్క కట్టి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లింది కాసులు. డాక్టర్ వంద రూపాయలు ఫీజు తీసుకుని కట్టు కట్టి, ఇంజక్షనిచ్చి డిస్పెన్సరీకి ఎటాచ్‌డ్‌గా నున్న తన బావమరిది షాపులోనే మందులు కొనమని సలహా ఇచ్చి ఓ వంద రూపాయల మందులు చీటీ రాసిచ్చాడు. మందులు, ఇంజక్షన్, డాక్టర్ ఫీజు మొత్తం కలిపి ఓ రెండొందల రూపాయలు వదిలాయి పరమేశానికి.

చేతికి కట్టు, చింపిరిజుట్టుతో ఆటోలో ఇంటికి చేరిన పరమేశాన్ని చూసి జాలితో "నాన్నా! ఆ పనస పండు, ఆవకాయ మోతకి మీరు పడ్డ శ్రమ, ఆటోచార్జీలు, డాక్టర్ ఫీజు, మందులు వగైరా ఖర్చులు ఇవన్నీ కలిపితే ఆ సొమ్ముకి ఈ ఊళ్లో ఎక్కువ శ్రమ లేకుండా పనసపండు పచ్చావకాయ వచ్చేది కదా!" అంది పరమేశం చిన్నకూతురు.

వంటింట్లో సగం కోసి మూల పడి ఉన్న పనసపండు కేసి దీనంగా చూస్తూ పట్టెమంచం మీద పక్కెక్కాడు పరమేశం.

